"ఓసారి ఇలా తే."

రైతు చాకు అందించాడు. అతనికేమీ అర్థం కాలేదు. గుమాస్తా కొరుకుదిగి ఆచెట్టు బోదె మీద ఇలా రాశాడు.

"నేను = నువ్వు = అతను
ఇదే సూత్రం
విప్లవ తత్వం."

"ఏమిటది?"

"చదువు."

చదివాడు రైతు. శ్రామికుడికి చదివి విని పించాడు.

"ఇది బోధివృక్షం" అన్నాడు గుమాస్తా.

మళ్లీ కొరుకు స్టార్టయింది.

* * *

"సింహాద్రీ, ఇదే ఆ అక్షరాల రహస్యం, అర్థం. రాగల సాంఘిక, ఆర్థిక విప్లవాల మూల సూత్రం ఈ మంత్రం."

ప్రకాశవంతమైన సిద్ధుడి కళ్ళు చెమ్మగిల్లాయి. సింహాద్రి కాంతి ప్రసారంచేసే ఆకళ్ల వైపు అలాగే చూస్తూ ఆలోచిస్తున్నాడు.

కథానిక

పేర్ల ప్రణయ గాథ

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆ అమ్మాయి పేరు ! మోహనరావు కేమీ నచ్చలేదు. చిన్నప్పటినించీ అలాటి పేర్లంటే అతనికి చాలా చికాకు. ఇంకా మూడేళ్ళు రోజూ నాలుగైదుసార్లు లెక్చరర్ అటెండెన్స్ తీసుకొంటూంటే ఈ పేరు వినాలనే భావం మోహనరావుకి చాలా బాధ కలిగించింది.

"రమణమ్మ!"

"ప్రెజెంట్ సర్" నీరసంగా, తియ్యని కంఠం.

ఈ మాటలు ప్రతి రోజూ వినడం ఎలాగునని ఆలోచిస్తూ ఆనాడే కాలేజీలో చేరిన మోహనరావు అటెండెన్స్ పలికిన అమ్మాయి వైపు చూచాడు.

తెలుపూ యెరుపూ కాకుండా చక్కని వర్ణంలో, తీర్చిదిద్దిన సౌష్ఠవయుతమైన అంగాల పొందికతో అందాలని చిందుతోన్నట్లు కనిపించింది ఆ అమ్మాయి మోహనరావుకి. నిజం చెప్పవలసివచ్చినా, రమణమ్మ చాలా అందగత్తె నని అంగీకరించక తప్పదు. కాలేజీ అబ్బాయిలకి అమ్మాయిల అందం గురించి మాటలాడుకోవడంలో తొందరా, అతిశయాలూ ఉన్న మోహనరావు దృష్టిలో రమణమ్మ చాలా న్యాయంగానే సుందరిగా కనిపించింది.

రెండు నిముషాలు తేరిపార చూచి మోహనరావు. సంతృప్తిగా చిరునవ్వు ఒకటి పారేశాడు ఎవరూ చూడకుండా మూడేళ్లు కొత్త కళ్ళకి నిండు ఉంటుందికదా అని. కాని ముల్లు గుచ్చుకున్నట్లు ఆ పేరు మళ్ళా జ్ఞాపకం వచ్చింది.

"రమణమ్మ"

కాలేజీలో చదువుకునే అమ్మాయిలు ఇలాంటి పేర్లతో ఉంటారని మోహనరావు అనుకోలేదు. ఆధునిక ప్రపంచంలో ఇన్ని వందల చక్కని నామధేయాలుండగా, ఈ పేరే దొరికిందా? ఏ పల్లెటూరిలోనో ఇల్లు తుడుచుకుంటూ, "నా పేరు - రమణమ్మ" అంటే బాగుంది కాని, లక్షణంగా కాలేజీలో చదువుకుంటూ ఈ పేరు ఏమిటి?

క్లాసు పూర్తయింది. అంతా వెళ్ళిపోతున్నారు. మోహనరావు అమ్మాయిల వెనకాల నడుస్తున్నాడు. వాళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు.

"ఏమే రమణీ-నీ సర్టిఫికేట్ వచ్చిందా?"

మోహనరావు గుండె ఝల్లుమంది... రమణి ...రమణి... ఎంత కటువుగా ఉంది! అయినా, వీళ్ళంతా ఎంత త్వరగా ఒకళ్ళకొకళ్లు స్నేహితులైపోయారు! ఉదయం నించీ తనొక్క

డైనా పలకరించిన పాపాన పోలేదు. ఆ మంచితనమూ, ఈ పేరులోని పటుత్వమూ మళ్లీ మోహనరావుని ఆలోచనలలోకి పంపాయి.

రోజులు గడుస్తోన్నకొద్దీ మోహనరావుకి రమణమ్మ సౌందర్యమూ, గాత్రమూ అన్నీ అభిమానపాత్రా అవుతున్నాయ్. రోజులు గడిచినకొద్దీ ఆమె పేరు అతనికి కఠోరం అయిపోతోంది మరీమరీ.

అసలు మోహనరావు పూర్వగాథ వింటేనే కాని, అతనికి పేరులమీద ఎంత అభిమానమో బోధపడదు. చిన్నప్పుడు వాళ్ళ అమ్మానాన్నా అతనికి వెంకట సుబ్బారావు అని పేరు పెట్టారు. ఎలాగో సుబ్బారావు థర్డు ఫారంలోకి వచ్చేసరికి ఓ చిన్న సంఘటన జరిగింది. వెంకట సుబ్బారావు యొక్క అత్యంత ప్రియమిత్రుడొకాయన, నిండుక్లాసులో అతన్ని "ఒరే, సుబ్బా" అని పిలిచాడు. సిగ్గువేసి, వెంకట సుబ్బారావు పలకడం మానేశాడు. దాంతో ఊరుకోవచ్చా? అలా ఊరుకోక ఆ ప్రియమిత్రుడు "ఒరే వెంకట సుబ్బయ్యా" అని పిలిచాడు. క్లాసులో అందరూ వున్నారు. అక్కడినుండి అందరూ వాణ్ణి "వెంకట సుబ్బయ్యా, సుబ్బన్నా, సుబ్బా, సుబ్బడూ" అని పిలవడం మొదలెట్టారు.

వెంకట సుబ్బారావుకి చచ్చినంత పనయి, చంపేసేంత కోపం వచ్చి, కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చింది. తలవంచుకుని కూర్చున్నాడు క్లాసులో.

ఇంతట్లో టీచర్ వచ్చి అటెండెన్స్ పిలుస్తున్నాడు...

"శ్యామల"

"కృష్ణారావు"

"వేణుగోపాలం"

"మురళీధర్"

"వెంకటసుబ్బ-సుబ్బారావు"

మళ్ళా క్లాసంతా గొల్లుమంది. అవమానం పట్టలేక వెంకట సుబ్బారావు ఇంటికి వెళ్ళి జరిగినదంతా నాన్నతో చెప్పి, తన పేరు మోహనరావుగా మారిస్తేనే గాని బడికి వెళ్ళనని అధికారయుతంగా తండ్రికి తెలియజేసి, ప్రాయోపవేశం చేసి కూర్చున్నాడు.

"ఇదేం విడ్డూరంరా?" అంది అమ్మ. "చిన్నప్పటి పేరెవ్వరైనా మార్చుకుంటారా?"

"మార్చకపోతే నేనన్నం తినేదిలేదు."

"ఇదేం బుద్ధిరా?"

అంతా ముక్కుమీద వేళ్ళు వేసుకున్నారు. కాని వెంకటసుబ్బారావు మాత్రం చలించకుండా మర్నాడు ఉదయంవరకూ అకుంఠిత దీక్షాయుతమైన ప్రాయోపవేశం చెయ్యడంతో వాళ్ళనాన్న హడలిపోయి, వాడి పేరు మోహనరావుగా మార్పించాడు డబ్బుకట్టి.

ఇదీ వాడి పూర్వ పేరు గాథ.

* * *

ఒకనాడు మోహనరావు మ్యాటినీషో సినిమాకి వెళ్ళాడు. కొంచెం ఆలస్యంగా వెళ్ళడంచేత లోపల ఏమీ కనపడడంలేదు. తిన్నగా వెళ్ళి ఏదో కుర్చీలో కూర్చున్నాడు. కొంచెంసేపు పోయాక, కళ్లు లోపలి చీకటికి సర్దుకున్నాక చూసేసరికి సరిగా తన ముందువరసలో కాలేజీ అమ్మాయిలంతా కూర్చున్నారు.

మోహనరావు ధీరోదాత్తుడే గాని, ఈ అమ్మాయిలముందు తాను ఎందుకూ పనికిరాడని అతనికి తెలుసును. అందుచేతనే ఎలాగయినా వాళ్ళని పలకరిద్దామనే కోర్కెని బలవంతంగా అణచిపెట్టుకుని, మగవాళ్ళతో స్వేచ్ఛగా మాటలాడేంత నాగరికత వీళ్ళకి రాలేదని అనుకుని తృప్తిపడి ఊరుకున్నాడు.

కాని అమ్మాయిలేమీ ఊరుకోలేదు.

"వెంకట్రామెందుకే మన వెయిటింగ్ రూమ్ చుట్టూ అలా తిరుగుతున్నాడు ఊరికే పోజులు కొడుతూ?" అందొక అమ్మాయి ఇంటర్వెల్ అయీ అవడంతోనే.

"వాడికో జబ్బులే...చాలామందికి ఈ జబ్బు పాకింది. ఎదురుగా నిలబడి మాటలాడడం ఒక్కడికీ చేతగాదు. ఆ మోహనరా ఒకడు."

మోహనరావుకి చెంపకాయలు తగుల్తున్నట్టున్నాయి. కాని రమణమ్మ అందుకుని "అతనంత పోజులు వెయ్యడులే" అంది.

అమ్మాయిలంతా తొందరగా "ఒహో! రమణి అతన్ని వెనుక వేసుకొస్తోంది" అని యెగతాళి చెయ్యడం మొదలెట్టారు. మోహనరావు ఇంక వాళ్ళ కళ్ళ పడితే పరువు దక్క

కని, మరో సీటుకి పోయి కూర్చున్నాడు. కాని, రమణమ్మకి తానంటే అభిమానం వుందని అతనికి ఆ వేళ తెలియడంతో మహానందం అనుభవించాడు.

బోటానిస్టులకి తెలియని గుణం ఒకటి వుంది ప్రేమ వృక్షానికి. ఆ వృక్షం చీకటిలోనూ, తిండి తక్కువయినా, యెదుగుతూంటుంది. ఈ ప్రేమలో పడడం మొదలెట్టకుండా ఉండాలి కాని, ఒక సారి పడ్డాక మరి తేరుకోవడం ఉండదు. ఒక్తి కమ్యూనిజం లాంటిది.

అనర్స్ కోర్స్ పూర్తయే లోపున మోహనరావు రమణమ్మతో నెమ్మదిగా పరిచయం చేసేశాడు. యథాశక్తి విరహం కూడా అనుభవించటం మొదలుపెట్టాడు.

అయితే, ఈ విరహంలో కొత్త పద్ధతి ఒకటి కనిపెట్టాడు. “రమణమ్మ” అనే విపరీత కఠోరశబ్దం రోజుకి కొన్ని వందలసార్లు అనుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు కనక, ఏ పేరుతో పిలిచినా గులాబీ గులాబీయే కనక, మోహనరావు రమణమ్మకి తన అంతరంగంలో పద్మిని అని నామకరణం చేసుకుని, విరహం ప్రారంభించాడు.

ఓ మంచి ముహూర్తాన మోహనరావు ఇంక భరించలేక, పద్మినిని తమ వివాహ విషయమై ప్రస్తావించేందుకు తయారై వెళ్ళాడు. వెతకబోయిన తీగ కాళ్ళకి తగిలినట్లు రమణమ్మే ఆ ప్రసక్తి ఎత్తేసింది.

“మన పరీక్షలు ఇంక రెండునెలల్లో అయిపోతాయి” అని ఉపోద్ఘాతం ప్రారంభించి, “మనం వివాహం చేసుకోక, ఇంక వీలులేదు” అని తేల్చేశాడు మిస్టర్ మోహన్.

ఆ అమ్మాయి అంగీకరించింది. కాని మోహనరావు ఆ సంగతికూడా అనేశాడు.

“నీకేమీ బాగులేదా పేరు... చక్కగా “పద్మిని” అని మార్చుకుంటే బాగుంటుంది పెళ్ళికిముందే.”

ఈ కాలపు అమ్మాయిలని నమ్మడానికి వీల్లేదు. అంతదాకా అంత ప్రేమ చూపుతూన్న రమణమ్మకి అతనిమీద ఒక్కసారి కోపం వచ్చేసింది.

“నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తే నా పేరేదైతేనే నీకేం?” అంది. మోహనరావు తెల్లముఖం వేశాడు. బ్రతిమాలి అంగీకరింపజేద్దామని ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. అంతటితో ఆ ఘట్టం పూర్తయినట్లు రమణమ్మ అతన్ని అక్కడే వదలిపెట్టి చివాలున ఇంటికి వెళ్ళిపోయింది.

* * *

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తరువాత మోహనరావు రమణమ్మని క్షమాపణ కోరుకున్నాడు. కాని, ఆ అమ్మాయి, ఒక షరతు మీద మాత్రం అతన్ని పెళ్ళాడుతానని అంది.

ఆ షరతుకి మోహనరావు అంగీకరించక తప్పలేదు. తరవాత కొద్దినెలల్లో వాళ్ళిద్దరూ వివాహం చేసుకున్నారు.

వెంకటసుబ్బారావుకీ రమణమ్మకీ దాంపత్యంలో యిప్పుడు లోటేమీ లేదు. కాని, తన మూడో ఘోరం కథ రమణమ్మ కెలాగ తెలిసిందో మాత్రం మోహనరావుకి అంటే వెంకటసుబ్బారావుకి నేటికీ తెలియలేదు.

అంతర్జాతీయ గ్రామీణ విజ్ఞాన వినియమార్థం నూతనంగా ఏర్పాటు చేయబడిన వ్యక్తి వినిమయం కార్యక్రమం రీత్యా భారతదేశం నుంచి ఇటీవల అమెరికా వెళ్ళిన ఒక కర్షకుని యాత్రకు ప్రత్యామ్నాయంగా భారతదేశంలో సంచారార్థం ఒక అమెరికా వార్తా పత్రికా సంపాదకుడు, ఒక అమెరికా కర్షకుడు విమానంలో న్యూయార్కు నుంచి బయలుదేరారు.

ఇండియాలో ఉత్తర ప్రదేశంలోని ఎటావా వాసియైన యువకర్షకుడు శ్రీ అమర్ సింగ్ కడచిన సెప్టెంబరు, అక్టోబరు నెలలలో అమెరికా వెళ్ళి ఆరు వారాలు కెరోల్ (జార్జియా) గ్రామీణ ప్రాంతంలో కర్షకులతో కాలంగడిపారు. ఈయన రాకకు ప్రత్యామ్నాయంగానే పైన చెప్పిన ఇద్దరు ఇప్పుడు భారతదేశం వస్తున్నారు.